

రంజిత్‌కు చెక్కు అందజేస్తున్న రుద్ర రచన

## నిరుపేద విద్యార్థికి రుద్రరచన సాయం

కథలాపూర్, సెప్టెంబర్ 30: చదువుకొనేందుకు తాను పడ్డ కష్టాలు మరెవరూ పడకూడదని తలంచింది జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన అనాథ యువతి రుద్ర రచన. మంత్రి కేటీఆర్ సహకారంతో బీటెక్ పూర్తి చేసిన ఆమె సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడింది. తన గ్రామానికి చెందిన సాదుల రంజిత్ అనే పేద ఇంజినీరింగ్ విద్యార్థి చదువు కోసం రచన రూ.12 వేల ఆర్థిక సాయాన్ని శనివారం అందజేసింది. రుద్ర రచన ఇటీవలే సీఎంఆర్‌ఎఫ్‌కు రూ.లక్ష విరాళాన్ని అందించిన విషయం తెలిసిందే.

## సిరిసిల్ల విద్యార్థినికి ఐకార్‌లో 17వ ర్యాంకు



స్వాతి

చందుర్తి, సెప్టెంబర్ 30: ఐకార్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ రీసెర్చ్)లో రాజన్న సిరిసిల్ల జిల్లా విద్యార్థిని సత్తా చాటింది. శనివారం విడుదలైన ఫలితాల్లో చందుర్తి మండలం నర్సింగాపూర్‌కు చెందిన రాపెల్లి స్వాతి కమ్యూనిటీ సైన్స్ విభాగంలో జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు సాధించింది.

## డ్రైన్‌లో పడి మహిళా కానిస్టేబుల్ మృతి

భద్రాచలం, సెప్టెంబర్ 30: కొత్తగూడెం పోలీస్ కంట్రోల్‌రూంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శ్రీదేవి(35).. శనివారం భద్రాచలంలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా బందోబస్తులో విధులు నిర్వహిస్తున్నది. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఒక్కసారిగా భారీ వర్షం కురిసి రోడ్డు జలమయమైంది. దీంతో డ్రైన్ కనపడక ఆమె అందులో పడి కొట్టుకుపోయింది. పోలీసులు, ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఆమె మృతదేహాన్ని బయటకు తీసి భద్రాచలం ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించినట్టు పట్టణ సీఐ నాగరాజ్‌రెడ్డి తెలిపారు.

# ప్రతి ఎకరం తడిసేలా సాగునీరు

- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ కృషితో ఎగువన ఉన్న వేలేరుకు నీరు
- ఇక మెట్ట ప్రాంతాలు సస్యశ్యామలం
- ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- గుండ్లసాగర్ శివారులో లిఫ్ట్ ద్వారా నీటి విడుదల



శనివారం గుండ్లసాగర్ శివారులో ఏర్పాటు చేసిన పైపులైన్ ద్వారా నీటిని విడుదల చేసి పరిశీలిస్తున్న రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి

వేలేరు, సెప్టెంబర్ 30: ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు సీఎం కేసీఆర్ నిధులు మంజూరు చేయగా, గత ఫిబ్రవరిలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ వేలేరు మండలంలోని సోడాషపల్లిలో పైపులైన్ పనులకు శంకుస్థాపన చేశారు. అవి పూర్తి కావడంతో శనివారం ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి గుండ్లసాగర్ శివారులో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పైపులైన్ ద్వారా సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ తెలంగాణలోని మారుమూల గ్రామాల్లో సైతం ప్రతి ఎకరం తడిసేలా సాగునీరు అందించేందుకే సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారని తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గంలోని ఎగువ ప్రాంతాలైన వేలేరు, ధర్మసాగర్, చిల్పూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు నిధులు మంజూరు చేశారని చెప్పారు. గుండ్లసాగర్ శివారులో ఏర్పాటు చేసిన లిఫ్ట్ పైపులైన్ ద్వారా వేలేరు, లోక్యాతండా, మిరపకుంట తండా, ఎర్రబెల్లి గ్రామాలకు సాగునీరు అందుతుందని చెప్పారు. ధర్మసాగర్ మండలంలోని ముప్పారం, నారాయణగిరి గ్రామాలకు సైతం సాగునీరు చేరుతుందని ఆయన పేర్కొన్నారు. లిఫ్ట్-2 ద్వారా నష్కల్, ధర్మారం, వంగాలపల్లి గ్రామాలకు సాగునీరు అందించేందుకు పనులు జరుగుతున్నాయని, చిల్పూరు మండలంలోని పలు గ్రామలకు సైతం సాగునీరు చేరుతుందని అన్నారు. త్వరలోనే ఆయా గ్రామాలకు పూర్తి స్థాయిలో సాగునీరు అందుతుందని వివరించారు. లిఫ్ట్-3లో భాగంగా కన్నారం గ్రామ చెరువులోకి సాగునీరు అందించేందుకు పనులు ప్రారంభించినట్టు తెలిపారు. వచ్చే యాసంగి వరకు పైపులైన్ పనులు పూర్తి చేసి, కన్నారం, పీచర, వావిల్లకుంట గ్రామాలకు సైతం సాగునీరు అందిస్తామని చెప్పారు. గుండ్లసాగర్ శివారులోని పైపులైన్ వద్ద ఎమ్మెల్సీ పల్లా పూజలు చేసి నీటిని విడుదల చేయగా నాయకులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ సంబురాలు జరుపుకొన్నారు. సాగునీరు అందించేందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ పల్లాకు రైతులు, ప్రజాప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## రాష్ట్రంలో తొలి సిటిజన్ యూత్ పార్లమెంట్

- ఓయూ వేదికగా అక్టోబర్ 8, 9, 10 తేదీలలో నిర్వహణ
- సిటిజన్ ఇండియా సీఈవో స్వాతిచంద్రశేఖర్ వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'మీరు భారత పార్లమెంట్ సభ్యులు కావాలనుకుంటున్నారా? పార్లమెంట్‌లో మీ వాగ్ధాటితో దేశం మొత్తాన్ని ఆకర్షించాలనుకుంటున్నారా? అయితే.. సిటిజన్ యూత్ పార్లమెంట్ సమావేశాన్ని వినియోగించుకోవాలని' సిటిజన్ ఇండియా సీఈవో స్వాతిచంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. సిటిజన్ యూత్ పార్లమెంట్‌ను.. తెలంగాణలో తొలిసారిగా ఉస్మానియా యూనివర్సిటీ సౌజన్యంతో వర్సిటీలోని ఠాగూర్ ఆడిటోరియంలో అక్టోబర్ 8, 9, 10 తేదీలలో నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సిటిజన్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొన్న యువత.. పార్లమెంట్‌లో ఎంపీలు ప్రజా సమస్యలపై మా ట్లాడినట్టుగానే.. దేశ అభివృద్ధి, సామాజిక, ఆ ర్థిక, రాజకీయ, విద్యా, వైద్యం, సంక్షేమం వం టి అన్ని రంగాలపై తమ ఆలోచనలు పంచుకునే అవకాశం ఉందని చెప్పారు. 18 నుంచి 40 ఏండ్లు ఉన్న స్త్రీ, పురుషులు ఎవరైనా యూత్ పార్లమెంట్‌లో పాల్గొనవచ్చని వివరించారు. యూత్ పార్లమెంట్ వేదికలో యువతతోపాటు ఆయా రంగాల్లో నిష్ణాతులు, ప్రొఫెసర్లు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పా ల్గొంటారని చెప్పారు. యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో మొత్తం మూడు అంశాలపై ప్రధానంగా చర్చిస్తారని, వాటిలో తెలంగాణ అంశాన్ని ప్రధానంగా ఎంపిక చేశారని వివరించారు. తెలంగాణ రాకముందు, వచ్చిన తర్వాత అభివృద్ధి ఎలా జరిగింది? వ్యవసాయం ఎలా బాగుపడింది? రైతుబంధు పథకం ఎలా అమలవుతున్నది? వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చిస్తారని పేర్కొన్నారు. రెండో అంశంగా యూనిఫారం సివిల్ కోడ్‌ను తప్పనిసరిగా అమలు చేయాలన్నదానిపై ఈ వేదిక ద్వారా చర్చించనున్నట్టు తెలిపారు. మూడో అంశంగా మహిళా బిల్లు గురించి చర్చించనున్నట్టు స్వాతి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ విధంగా రాష్ట్రాల వారీగా నిర్వహించనున్న యూత్ పార్లమెంట్ వేదికల ద్వారా దేశ వ్యాప్తంగా మొత్తం 543 మంది.. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ వేదికగా నిర్వహించనున్న నేషనల్ లెవల్ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనడానికి అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఇందులో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న యువత/విద్యార్థులు ముందస్తు రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అక్టోబర్ 4 వరకు గడువు విధించారు. రిజిస్ట్రేషన్ కోసం http://forms.gle/3rshpgfR5fe4ACUa9 పోర్టల్‌ను, పూర్తి వివరాల కోసం 9319256888లో సంప్రదించాలని నిర్వాహకులు సూచించారు.



కరీంనగర్‌లోని 41వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్. చిత్రంలో మేయర్ సునీల్‌రావు

## బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే మరింత అభివృద్ధి

- మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్ కార్పొరేషన్, సెప్టెంబర్ 30: ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి పాలకులు కరీంనగర్ అభివృద్ధికి రూపాయి కూడా ఇవ్వలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. కానీ సీఎం కేసీఆర్ తొమ్మిదేండ్లలో మంజూరు చేసిన రూ. వెయ్యి కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. ఈ ప్రగతి నిరంతరాయంగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ప్రజలను కోరారు. శనివారం ఆయన కరీంనగర్‌లో రూ.133 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. సీతారాంపూర్‌లోని సాయి దేవాలయంలో పూజలు చేశారు. అనంతరం అక్కడే మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందించాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ రాకముందు కరీంనగర్ ఎలా ఉండేదో.. ఇప్పుడు ఎలా ఉన్నదో ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచించారు. తొమ్మిదేండ్లలో పెద్ద ఎత్తున రోడ్లను నిర్మించినట్టు తెలిపారు. కేబుల్ బ్రిడ్జి అందుబాటులోకి రాగా, మానేరు రివర్ ఫ్రంట్‌ను ఏడాదిలోగా పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, నగర కమిషనర్ ప్రపుల్‌దేశాయ్ పాల్గొన్నారు.



రాయపర్తిలో మహిళా సంఘాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి దయాకర్‌రావు

## కేసీఆర్ పాలనలో మహిళల కష్టాలు దూరం

- త్వరలో 10వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

వర్ధన్నపేట(రాయపర్తి), సెప్టెంబర్ 30: గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక శక్తిని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. శనివారం వరంగల్ జిల్లా రాయపర్తిలో మండల కేంద్రంలో రూ.10 కోట్లతో ఆరు లేన్ల జాతీయ రహదారి విస్తరణ, రూ.3 కోట్లతో సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ పనులకు కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. మధ్యాహ్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో స్వర్ణభారతి మండల సమాఖ్య 14వ వార్షిక మహాసభకు హాజరయ్యారు. అనంతరం మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రూరల్ మార్ట్‌ను ప్రారంభించారు. మహిళా సంఘాలకు వివిధ బ్యాంకుల నుంచి మంజూరైన రూ.43 కోట్లకు సంబంధించిన చెక్కులను అందజేశారు. పలు గ్రా మాలకు చెందిన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు, గృహలక్ష్మి ఇండ్ల మంజూరురి పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నట్టు తెలిపారు. మహిళలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఆసక్తి, అర్హత ఉన్న యువతులు, మహిళలకు కుట్టు శిక్షణ ఇప్పించడంతోపాటు ఉచితంగా కుట్టుమెషిన్లను అందిస్తున్నామని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో 10వేల మందికి ఉద్యోగ, ఉపాధి లభించేందుకు కంపెనీలతో మాట్లాడినట్టు పేర్కొన్నారు.



వరంగల్ జిల్లా నర్సంపేటలో దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి

## కాంగ్రెస్ మోసపూరిత హామీలను నమ్మొద్దు

- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి
- దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లు

నర్సంపేట, సెప్టెంబర్ 30 : కాంగ్రెస్ నాయకుల మోసపు మాటలను ప్రజలు నమ్మొద్దని వరంగల్ జిల్లా నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 41 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్లను దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవారెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ కాంగ్రెస్ పాలిస్తున్న ఛత్తీస్‌గఢ్, కర్ణాటకలో ఇవ్వలేని పథకాలను తెలంగాణలో ఇస్తామని చెబుతున్నదని, వాటిని ప్రజలు విశ్వసించడం లేదని అన్నారు. పల్లె, పట్టణ ప్రజలు సీఎం కేసీఆర్ ఇస్తున్న పథకాల పట్ల ఆసక్తితో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలు అమలుకు సాధ్యం కాని హామీలిస్తూ ప్రజలను మోసగిస్తున్నాయని మండిపడ్డారు. దివ్యాంగుల సంస్థ చైర్మన్ వాసుదేవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 5.20 లక్షల మంది దివ్యాంగులకు పింఛన్లు అందిస్తున్నట్టు చెప్పారు.

